ప్రజాశక్తి

సోమవారం 8 సెప్టెంబర్ 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్



ప్రజాశక్తి-నెల్లూరు నగరంలోని చెన్నయ్ హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నిర్వాహకులు చెన్నయ్ ప్రాంతంలోని ప్రముఖ కార్పొరేట్ వైద్యశాలలకు చెందిన డాక్టర్లతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేషన్ కమిషనర్ వై.వి.నందన్ అన్నారు. ఈ వైద్యశిబిరంలో గ్రేమ్ ఇండియా వైద్యశాల డాక్టర్ల సహకారంతో అధునాతన పరికరాల సహాయంతో వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా సంతోషకర మన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాల న్నారు. మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ, సెంటర్ నిర్వా హకులు ఎస్.వి.రమేష్‌బాబు మాట్లాడారు. చెన్నయ్ ప్రాంతానికి చెందిన గ్రేమ్ ఇండియా హాస్పిటల్స్ కు చెందిన డాక్టర్ ఆర్. కన్నన్‌గైనిక్ వైద్యనిపుణులు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య 'పోరు' సాగిద్దాం..!

ఘనంగా సిఐటియు రూరల్ నాలుగో మహాసభ



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు టివిని ప్రసాద్

ప్రజాశక్తి-నెల్లూరు


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంభి స్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని ఏకం చేసి ఐక్య ఉద్యమాలు చేసినప్పుడే కార్మిక విజయం దక్కుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి. ప్రసాద్ తెలిపారు. ఆదివారం వేదాయపాలెం ప్రాంతంలోని ఎం.వి.ఎస్ కళ్యాణమండపంలో సిఐటియు రూరల్ 4వ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభోత్సవానికి ముందుగా సిఐటియు సీనియర్ నాయకులు డి.సంపత్ కుమార్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన నాయకులు నారు కృష్ణయ్య,మురళి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దుచేసి కార్పొరేట్లకే కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోర్సును తీసుకొని వచ్చిందని, దీనికి వ్యతిరేకంగా కార్మికుల ఐక్యం చేసి పోరాడు తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తానా అంటే రాష్ట్రం లోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తందానా అంటుందని విమర్శించారు. వర్గీయ పేరుతో కర్షక ప్రాంతంలో బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం పూనుకోవడం ను సిఐటియు ఖండిస్తుందని తెలిపారు.

ఎరుపెక్కిన వేదాయపాలెం సెంటర్

సిఐటియు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ సిఐటియు రూరల్ నాలుగో మహాసభల ముగింపు సందర్భంగా భారీ ర్యాలీ వేదాయపాలెం ఎంవిఎస్ కళ్యాణ మండపం నుండి అయ్యప్ప గుడి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసే సంఘం సిఐటియు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభ తర్వాత సిఐటియు రూరల్ నూతన కమిటీ 35 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది 15 మంది ఆఫీస్ బేరర్స్ గా 35 మందితో కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎం సుధాకర్ ,కె పెంచల నరసయ్య ,కోశాధికారిగా ఎస్కే ఖాజావలి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆఫీస్ బేరర్స్ గా కొండా ప్రసాద్, కెవి శివాజీ, పి నరసింహారెడ్డి ,ఏ దేశమూర్తి, ఎండి అబ్దుల్ అజీజ్ ,ఈ శరత్ బాబు, సిహెచ్ సుజాతమ్మ ,ఎస్కే శంషాద్, పి నర్సింహారెడ్డి ,బి అంజిరెడ్డి ,ఎస్ కె ఖలీల్ ,డీ లవన్ కుమార్, ఎస్కే సంగానీ భాష లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు డి. సంపత్ కుమార్ ఎన్. మాలకొండయ్య ,జి. నాగేశ్వరరావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు రూరల్ నూతన కమిటీ నేతలు..



వైద్య శిబిరంలో మహిళలు..

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-నెల్లూరు నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల వైద్యులు నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన కనిపించింది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన వైద్యశిబిరంలో జిల్లా పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు (దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు) పాల్గొని ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకున్నారు. "క్షయ, మధుమేహం వ్యాధులతో బాధపడుతున్న వారు ఉదయం ఎటువంటి ఆహారం తీసుకోకుండా, ఆహారం తీసుకున్న తరువాత రక్త పరీక్షలు నిర్వహిం చుకున్నారు. కేవలం రూ. 250లు చెల్లించి రెండు నెలలకు సరిపడా మందులు తీసుకున్నారు. డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలలో పనిచేస్తున్న వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. నేత్ర పరీక్షలు సైతం నిర్వహించారు. డాక్టర్ జెట్టి శేషారెడ్డి కేంద్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు ఒక సారి ఈ వైద్యశిబిరం గడిచిన కొన్ని ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. డాక్టరు రామచంద్రారెడ్డి వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టరు బి.రాజేశ్వరరావు, డాక్టరు నాయక్, ప్రజాసంఘాల నాయకులు నగేష్, జి.కామయ్య,జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు 'సీతారాం ఏచూరి'

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పోరాట యోధుడు సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాలెం గ్రామంలో ఆదివారం కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఇసకపాలెం శాఖ కార్యదర్శి బండి శౌరి గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, మండల కార్యదర్శి ఈపూర్ లక్ష్మయ్య, సిఐటియు కార్యదర్శి రాజా, మండల కమిటీ సభ్యులు వెంకట శేషయ్య, కొండయ్య, రాధయ్య, ఉంగ్రాళ్ళ సీనయ్య, పచ్చ మధు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పోరాట యోధుడు సీతారాం ఏచూరి అని తెలిపారు. దేశంలో కష్ట జీవుల రాజ్యం కోసం, సమ సమాజం కోసం పోరాడిన వీరుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. కార్మిక కర్షక వర్గాలు కోసం, హక్కులు కోసం ప్రజా క్షేత్రంలో పోరాడటంతో పాటు చట్ట సభల్లో హక్కుల కోసం గళమెత్తిన ఉద్యమ కెరటం ఏచూరి అని రమేష్ పేర్కొన్నారు. సీతారాం ఏచూరి అందించిన స్ఫూర్తితో కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఉద్యమివ్వాలని రమేష్ పిలుపు నిచ్చారు. దీనికి ముందు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఎం ప్రతినిధులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

శాస్త్రీయ దృక్పథంపై అవగాహన అవసరం

జెవివి జిల్లా మహాసభలో వక్తలు



మాట్లాడుతున్న గేయానంద్

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజలు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కలిగి ఉండాలని జెవివి నాయకులు పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభోత్సవానికి ముందుగా జాతీయ జెండా, జెవివి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ జెండాను చొప్పా రవీంద్ర, జెవివి జెండాను జనవిజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ .శంకరయ్య ఆవిష్కరించారు. మహాసభలకు రాష్ట్ర కేంద్రం నుంచి ముఖ్యఅతిథిగా హాజరైన జె.వి.వి రాష్ట్ర కమిటీ అధ్యక్షులు డాక్టరు గేయానంద్ జెవివి చేయాల్సిన ఉద్యమాలపై దశదిశ నిర్ధేశం చేశారు. అనంతరం కార్యదర్శి నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, ఆర్థిక నివేదికను విద్యాచరణ్ చదివి వినిపించారు. అనంతరం నిర్వహించిన నూతన కమిటీ ఎన్నికలకు అధికారిగా డాక్టరు ఎస్‌కె కాలేషా వ్యవహరించారు.

నూతన కమిటీ ఎన్నిక

జన విజ్ఞాన వేదిక మహాసభ ముగింపు సందర్భంగా నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. జిల్లా నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా డాక్టర్ యస్.కె.కాలేషా బాషా , జీ. కామయ్య. వీ. పెంచలయ్యలను ఎంపికైనట్లు ప్రకటించారు. జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా యం.వీ. చలపతి, ఏ.విజయ కుమార్. కోశాధికారి :- పీ. బజ్జయ్యలు ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరితోపాటు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా 15 మంది, మరో 15 మందితో కార్యవర్గంగా కలుపుకోని మొత్తం 30 సభ్యులతో నూతన కమిటీ ఏకగ్రీవంగా సభ ఎన్నుకున్నది.



జెవివి జిల్లా నూతన కమిటీ

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా 'చిల్లకూరు'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : వైసిపిలో అధిష్టానం వివిధ పదవుల ను భర్తీ చేసింది. అందులో భాగంగా విజయ డెయిరీ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డికి అధిష్టానం కీలక బాధ్యతను అప్పగించింది.ఈ మేరకు ఆయన్ను రాష్ట్ర కార్యదర్శిగా నియ మించింది. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సుధీర్ రెడ్డిని పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ అసెంబ్లీ నియోజకవర్గంలోని నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలను కేటాయించింది. నేపథ్యంలో సుధీర్ రెడ్డి వైసీపీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకొంటూ సంబంధిత రీజనల్ కో-ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీ లకు సహాయకులుగా వ్యవహరించనున్నారు. సుధీర్ రెడ్డి అపార రాజకీయ అనుభవం వున్న నాయకులే కాకుండా, విజయ డెయిరీ మాజీ చైర్మన్ గా ఈ రెండు నియోజకవర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయి. సుధీర్ రెడ్డి నియామకంతో నెల్లూరు సిటీ, నెల్లూ రు రూరల్ నియోజకవర్గలాలో వైసిపి బలపడే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.



చిల్లకూరు సుధీర్‌రెడ్డి

రాంబాబుకు సన్మానం

ప్రజాశక్తి -కందుకూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పోకూరు రాంబాబు ను ఆదివారం వారి నివాసమందు ఉపాధ్యాయు లు ఘనంగా సన్మానించారు. కందుకూరి సుబ్బనాచారి, సంగా మహేంద్ర, చల్లా బ్రహ్మయ్య, వేమా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ లు అభి నందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ విద్య అభివద్ధిలో క్రియా శీలకంగా ఉండాలని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యాశాఖ ఉన్నతంగా పనిచేస్తుందని ప్రాథమిక స్థాయిలో పునాది అక్షరాస్యత, సంఖ్యా భావనలు, రెమిడీయల్ టీచింగ్ ద్వారా అభ్యసన సామర్థ్యాలు, విద్యా లక్ష్యాలు, సాధించాలని ఈ సందర్భంగా రాంబాబు తెలిపారు.

గిరిజనులకు ప్రత్యేక 'ఆధార్' శిబిరాలు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో ఆధార్ కార్డు లేని ఎస్‌టిల కోసం 6 రోజులపాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆధార్ కార్డు లేని ఆయా సామాజిక వర్గీయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం ఆధార్ శిబిరాలు నిర్వహించే తేదీల వివరాలను వెల్లడించారు.

ప్రజలపై భారాలు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్రంలో బిజేపి ప్రభుత్వం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఓటర్లకు చేసిన హామీలను విస్మరించి, కార్పొరేట్ శక్తులకు లాబాలు చేకూరే విధమైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలపై భారాలు మోపడమే ప్రథమ కర్తవ్యంగా పాలన సాగిస్తున్నాయని సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ విమర్శించారు. ఆదివారం పోదలకూరు ప్రాంతంలో సిపిఎం మండల ప్లీనరీ సమావేశానికి ఆయన ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. . కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతున్న నేపథ్యంలో ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని, రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదిన నగరంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి ప్రజలు, మేధావులు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. సిఐటియు రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. నాయకులు అల్లాడి గోపాల్, మండల నాయకులు వి.మనోహార్, శ్రీనివాసులు, గుడిమణి రంగయ్య, ఆటో యూనియన్ నాయకులు గౌరీ పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.



మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి -ఉలవపాడు : ఈ ఏడాది డిసెంబర్ 31నుండి 2026 జనవరి 4 వరకు సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు విశాఖలో జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని సిఐటియు నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉలవపాడులోని కరేడు ర్యాంపులో గల పి.టి.పి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జనరల్ బాడీ సమావేశం ఉదయం జరిగింది. ఈ సమా వేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. మాట్లాడారు. ఈనెలలో జిల్లాలో జరిగే జరిగే సిఐటియు మండల, జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జనవరి 4న విశాఖ ఆర్. కే బీచ్ లో జరిగే భారీ కార్మిక బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరు కావాలని కోరారు. ఫ్యాక్టరీల్లో కార్మిక శాఖ జిల్లా స్థాయి అధికారులు ప్రతినెలా వచ్చి తనిఖీలు నిర్వహించి, కార్మికులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాల గురించి యాజమాన్యాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. 200 మంది కార్మికులు ఉండే పరిశ్రమలలో వాహన సౌకర్యం కల్పించాల్సి ఉండగా పి.టి.పి ఫ్యాక్టరీలో అమలు కాలేదన్నారు. ఈ.ఎస్.ఐ సౌకర్యం లేదన్నారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్,యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సవరం శ్రీను వాసులు,గంజి శ్రీనువాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. మస్తాన్ బి, ఆఫీస్ బేరర్లు, కార్మికులు ఉన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్

దేశవ్యాపితంగా 'గోల్డెన్ అవర్' వైద్యం

రూ 1.5 లక్షల వరకు ఉచిత సేవలు - టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ చికిత్స కోసం నగదు రహిత చికిత్స పథకాన్ని 'గోల్డెన్ హవర్' వైద్యాన్ని అందులో బాటులోకి వచ్చిందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన నెల్లూరులో మీడియాతో మట్లా డారు. కేంద్ర ప్రభుత్వం గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం దాదాపుగా 6.80లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయన్నారు. ఈ ప్రమాదాలు వల్ల దాదాపుగా 3.72 లక్షల మరణాలు సంభవిస్తున్నా యన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సకాలంలో చికిత్స అందిస్తే కొన్ని ప్రాణాలు అయినా కాపాడే అవకాశం ఉందని, ఇప్పటి వరకు అది జరగలేదన్నారు. ప్రమాదం జరిగిన సమ యంలో వైద్యానికి అవసరమైన నగదు బాధితుల వద్ద ఉండకపో వచ్చునని, ప్రమా దం జరిగిన వ్యక్తి తన వివరాలు చెప్పే పరిస్థితి కూడా ఉండదన్నారు. కుటుంబ సభ్యులు కు ప్రమాద విషయం తెలియక ,చికిత్స కు అవసరమైన నగదు లేక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత చికిత్స అందించేలా చట్టం తేవాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిం చిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాద బాధితుల నగదు రహిత చికిత్స పథకం 2025 ను రూపొం దించిందన్నారు. ఇది దేశ వ్యాపితంగా ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుదన్నారు.



మాట్లాడుతున్న చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి

బి.వి.రమణ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు పట్టణంలోని శ్రీ జనార్ధన స్వామి కొత్త కళ్యాణ మండపంలో డాక్టర్ బి.వి.రమణ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు సభా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాహితీవేత్త డాక్టర్ రంగశెట్టి రమేష్, విశ్వసాహితీ కళా వేదిక వ్యవస్థాపకురాలు కొల్లి రమావతి డాక్టర్ బి వి రమణ కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. వీరితోపాటు ఎస్ టి యు అధ్యక్షులు వై హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు అశోక్ బాబు, ఎస్ టి యు అధ్యక్షులు కేపీ జాన్సన్, కావలి ఎంఇఒ బండి గోవిందయ్య, హెచ్‌ఎం లు మాధవరావు, డి ఎస్ కే వి ప్రసాద్, ఎం సాంబశివ, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు డాక్టర్ బి వి రమణ చేసిన సేవలను కొనియాడారు. ఒక ఉపాధ్యాయ వత్తిలో ఉండి విద్యార్థులకు విద్యాబుతులు నేర్పించడంతోపాటు ఆధ్యాత్మిక, యోగ, ధ్యానం లాంటి కార్యక్రమాలతో సమాజానికి మరిన్ని సేవలందించారని, ఉద్యోగ విరమణ అనంతరం సమాజానికి మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. డాక్టర్ బి.వి రమణ చేసిన సేవలను శ్యాంసుందర్ బయోపిక్ రూపంలో ప్రదర్శించారు. తెలుగు పండిట్ శ్యామ్ వ్యాఖ్యానం అందరినీ ఆకట్టుకుంది. డాక్టర్ బి వి రమణ బంధువులు, మిత్రులు, సహచర ఉపాధ్యాయులు బి.వి.రమణ చేసిన సేవలను కొనియాడి రమణ ధర్మపత్ని సులోచనను సన్మానించారు.



9న రైతుల ఆందోళన : వైసిపి

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : యూరియా కోసం మండుటెండలో అన్నదాతలు నరకయాతన అనుభవిస్తుంటే కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తుందని వైసిపి మండల అధ్యక్షుడు అనుమోలు లక్ష్మి నరసింహ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్నదా తలకు యూరియా సకాలంలో అందజేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న కందుకూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో వైసిపి నియోజ కవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ హాజరువతారన్నారు. రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



కోడూరు తీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

తోటపల్లిగూడూరు మండలం కోడూరు సముద్ర తీరం లో ఆదివారం సందడి వాతావరణం ఏర్పడింది. కొంత సమయం కుటుంబ సభ్యులతో, బంధుమిత్రు లతో సర దాగా గడిపేందు కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుం చి భారీ సం ఖ్యలో ప్రజలు కోడూరు తీరానికి తరలి వ చ్చారు. తీరం వెంబడి ఎస్ఐ వీరేంద్ర బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏ ర్పాటు అయ్యింది. గతంలో సంభవించిన ప్రమాదాల దష్ట్యా పోలీసులు ప్రజల ను అప్రమత్తం చేశారు. సముద్రంలో లోతుకు వెళ్ళకుండా విజిల్స్ వేస్తూ ప్రజల ను పోలీసులు అప్రమత్తం చేశారు. అధిక సంఖ్య లో తరలి వచ్చిన ప్రజల తో కోడూరు సముద్ర తీరంలో పండుగ వాతావరణం నెలకొంది.

చింతారెడ్డిపాళెం వెళ్లే జాతీయ రహదారి వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాల్సిందే..

ప్రజాశక్తి-నెల్లూరు

చింతారెడ్డిపాళెం ప్రాంతం సమీపంలోని జాతీయ రహదారి వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని అండర్‌పాస్ బ్రిడ్జి సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం 16వ డివిజన్, ఆదిత్యానగర్ ప్రాంతంలోని చిల్డ్రన్స్ పార్కులో చింతారెడ్డిపాళెం ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జి సాధన సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం, సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కాయంబు శ్రీనివాసులు, పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసించేందుకు, ఉద్యోగ ఉపాధి నిమిత్తం నగరానికి చెందిన అనేక మంది హైదరాబాదు, విజయవాడ, తిరుపతి, చెన్నయ్, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్ళి ఉన్నారన్నారు. వారందరూ తమ కుటుంబ సభ్యులను కలిసేందుకు, శుభకార్యక్రమాలకు హాజరైయ్యేందుకు ఆయా ప్రాంతాల నుంచి నగరానికి చేరుకొనే క్రమంలో వారు తమ తమ వాహనాలు చింతారెడ్డి పాళెం ప్రాంతం నగరంలోకి

అండర్‌పాస్ బ్రిడ్జి సాధన కమిటీ

ప్రవేశిస్తారన్నారు.ా వైద్య చికిత్సల నిమిత్తం నారాయణ, మెడికవర్ వైద్యశాలలకు వెళ్లే వారు అనేక మంది ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారన్నారు.ఈ జాతీయ రహదారి నుంచి భారీ వాహనాలు అతి వేగంగా ప్రయాణిస్తుంటాయని,ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోయన ఘటనలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న తరుణంలో జాతీయ రహదారి సంస్థ బ్లాక్ స్పాట్‌గా గుర్తించి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వానికి సూచనలు చేసిందన్నారు. సూచనల మేరకు ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు అంగీకరించినప్పటికీ కొన్ని రాజకీయ కారణాల వల్ల మరో ప్రాంతానికి తరలించారన్నారు. 15 సంవత్సరాల నుంచి ఈ సమస్యపై ప్రజలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు బ్రిడ్జి సాధన కోసం సీనియర్ సిటిజన్లు,వాకర్స్,ఇతర సామాజిక రంగాలల్లో ఉన్న ప్రజలు అందరూ కలిసి 'అండర్ పాస్ బ్రిడ్జి సాదన కమిటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ అండర్ పాస్ బ్రిడ్జి ఎంతో అవసరమని, ఈ సమస్య పరిష్కారానికి రాజకీయ నాయకులు, ప్రతినిధులు , ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తమకు అర్థం కావడం లేదని సిపిఎం నాయకులు కాయంబు శ్రీనివాసులు అవేదన వ్యక్తం చేశారు.చింతారెడ్డి పాళెం జెంక్షన్ ప్రాంతంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని బాలాజీనగర్, జగదీష్‌నగర్, రాంజీనగర్, నగరంలోని ప్రముఖులు, మేధావులు కోరుకుంటున్నారని, ఈ నేపథ్యంలోనే 11 మందితో అండర్‌పాస్ బ్రిడ్జి సాధన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసలు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం, తదితరులు

అండర్‌పాస్ బ్రిడ్జి సాధన సన్నాహక కమిటీ

చింతారెడ్డి పాళెం జంక్షన్ ప్రాంతంలోని జాతీయ రహదారి వద్ద ప్రభుత్వం తక్షణమే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని, ఈ సమస్య పరిష్కారం కోసం ఆందోళన, పోరాట కార్యక్రమాలు నిర్వహించేందుకు 11 మందితో అండర్‌పాస్ బ్రిడ్జి సాధన సన్నాహక కమిటీ ఏర్పాటు చేసినట్లు నాయకులు ప్రకటించారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా కాయంబు శ్రీనివాసులు, 13వ డివిజన్ కార్పోరేటర్ ఊటుకూరు నాగార్జున, కొట్టే రామూర్తి కో కన్వీనర్లుగా,జె. సుధాకర్, ఎం.వి.సుధాకర్, సుబ్బారావు, కె.వాసు, విటపు బాలసుబ్రహ్మణ్యం, మిట్టపాళెం ప్రసాద్,పేనేటి జనార్ధన్, కరుణాకర్,పాలిచర్ల శంకర్, పి.జె.బాబు లు సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : విశాఖపట్నంలో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని బోగోలు మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు తుమ్మల సీనయ్య పేర్కొన్నారు. ఆదివారం బోగోలు సిపిఎం కార్యాలయంలో సిఐటియు సర్వసభ్య సమావేశాన్ని మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు తుమ్మల సీనయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సిఐటియు సెక్రటరీ చాన్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలు డిసెంబర్ 1,2,3,4,5 తేదీలలో జరుగు సభలకు తప్పక హాజరు అవ్వాలని పలు సమస్యలపై సభలో చర్చలు జరుగుతాయని, భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న వాళ్ళ సమస్యలపై చర్చించాలని తెలిపారు. కార్యక్రమంలో బోగోలు సిపిఎం ప్రాంతీయ కమిటీ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి బాదుల్లా, సభ్యులు బ్రహ్మయ్య, దయాకర్, రాజేష్, మాల్యాద్రి, ఎన్ రామయ్య, పొట్లూరి శ్రీనివాసులు, అన్వర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిరావుకి సేవా అవార్డు

ప్రజాశక్తి-బిట్రగుంట : భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కట్టెపల్లి సింహాద్రి రావుకు ప్రజా సంకల్ప వేదిక సంస్థ కడప (శ్రీహరి డిగ్రీ కళాశాల)లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా పురస్కారం ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్ట్ న్యాయవాది మదిరె రంగసాయి రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రంగసాయి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రపతి అవార్డ్ గ్రహీత డాక్టర్ సింహాద్రి రావుకు తమ సంస్థ ద్వారా సేవా పురస్కారం అందించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. మానవసేవ మాధవసేవగా నినాదంతో 3 దశాబ్దాల కాలంగా హెచ్‌ఐవి ఎయిడ్స్ అనాథలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేశామన్నారు. అవార్డ్ గ్రహీత కట్టెపల్లి సింహాద్రి రావు మాట్లాడుతూ అవార్డులు బాధ్యత పెంచుతాయని, జీవితాంతం నిర్మాణాత్మకంగా సేవ చేస్తానని ప్రజాసంకల్ప వేదిక వారికి ధన్యవాదాలు తెలుపుకున్నామన్నారు.



రాజశేఖర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని మారంరెడ్డిపల్లె సొసైటీ అధ్యక్షులు ఆదివారం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. మునుపెన్నడూ లేని విధంగా సొసైటీ అభివృద్ధి జరుగుతుందని దానికి తమ శక్తి మేరకు కృషి చేస్తానని బ్యాంకుకు వచ్చిన రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని మారంరెడ్డిపల్లె సొసైటీ అభివృద్ధి పథంలో నడుపుటకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఒక చిన్న బిడ్డ తనకే ఇంతటి బాధ్యతను అప్ప చెప్పిన శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, వెంగలరెడ్డి వెంకటేశ్వర్లు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



ప్రజాశక్తి-ఇందుకూరుపేట : ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా సుహాసిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి విచ్చేసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఇందుకూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. రక్తదాన శిబిరానికి మండలంలోని యువకులంతా స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సిఎం అయింది మొదలుకొని అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాశక్తి-కావలి : 1975-76వ విద్యా సంవత్సరం కావలి విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఉదయం 50సంవత్సరాల తరువాత ఆదివారం విశ్వోదయ బాలుర పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సి.హెచ్.అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ ఉపాధ్యాయులు బి.మధుసూదనరావును, బి.సుధాకర్ రావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అన్నదాత మణి తనప్రసాద్ విద్యార్థులను ఆశీర్వదించారు. అమెరికా నుండి, రాష్ట్ర నుండి, రాష్ట్రేతర ప్రాంతాల నుండి విచ్చేసిన పూర్వ విద్యార్థులు ఉదయం నుండి సాయంత్రం వరకు కోలాహలంతో విశ్వోదయ ప్రాంగణం దద్దరిల్లింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.ద్వారకానాథ్ చౌదరి తన పాఠశాల అభివృద్ధి గురించి వివరించారు. నాటి పూర్వ విద్యార్థి వై.నారాయణరెడ్డి పాఠశాల అభివృద్ధికి రూ.1లక్ష విరాళంగా ప్రకటించారు. దానికి స్ఫూర్తిగా మరి కొంతమంది విద్యార్థులు ముందుకొచ్చి, విరాళాలు ప్రకటించారు. ఈ కార్యక్రమం సి.హెచ్ అజయ్ కుమార్, ఎంవి రామారావు, టంగుటూరి ప్రకాష్‌రావు, సమాధి.విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

కరాటేతో మానసిక వికాసం

ప్రజాశక్తి-బిట్రగుంట : పిల్లల మానసిక వికాసానికి క్రీడలతో పాటు కరాటే చాలా అవసరమని బిట్రగుంట ఎస్ఐ ప్రభాకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ కరాటే మాస్టర్ రవి గన్, రిపోర్టర్, కరాటే బ్లాక్ బెల్ట్ పసుగుల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే ఇన్‌స్టిట్యూట్లో కరాటే, టైక్వాండోలో శిక్షణ పొందిన కరాటే విద్యార్థుల టీమ్‌కి ఎల్లో బెల్ట్, గ్రీన్ బెల్ట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ పొందాలని, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ వారి సహకారంతో ఎన్నో మంచి సేవా కార్యక్రమాలను నిర్వహించారని, ఇప్పుడు విద్యార్థులకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నందుకు వారిని అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దగదర్తి ఎస్ఐ జంపాని కుమార్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు నూకసాని శ్రీనివాసులు, వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు స్వర్ణ రాజ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గోవిందరాజులు, జహీర్, నవాజ్, కరాటే విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, రైల్వే విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్టులు, ఆర్మీ విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి : మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా కావలి పట్టణం వైకుంఠపురంలోని మదీనా మస్జిద్ లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కావలి సబ్ డివిజన్ పోలీస్ అధికారి పి.శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న కరీముల్లా రక్తదాన ఆవశ్యకత, అపోహలు గురించి ప్రసంగించారు. ప్రభుత్వ ఖాజీ, ముస్లిం ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ముఫ్తీ ఖలీల్ అహమ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ హాజీ హాలిక్, రెడ్ క్రాస్ సభ్యులు, రక్తదాత శానం హరి, పలువురు ముస్లిం విద్యావేత్తలు పాల్గొన్నారు. కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, జనిగర్ల మనోహర్, జీవిత సభ్యులు అభిసాగర్, తదితరులున్నారు.

వంశీకృష్ణారెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-విడవలూరు : కోవూరు ఎఎంసి చైర్మన్ బెజవాడ వంశీరెడ్డిని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ న్యాయవాది దాసి ప్రసాద్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నేషనల్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు పులి మనోజ్‌కుమార్, మురళీధర్, సుమన్, వెంకటేష్, అంకయ్య, చంద్రశేఖర్ రెడ్డి, రవి, ప్రతాప్ ప్రేమ్ సాగర్, ప్రతాప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నె జడగోగుల గ్రామాల మధ్య ఉన్న దిబ్బరేవు వారు బ్రెడ్జి కెనాల్ కట్ట దగ్గరలో గుర్తు తెలియని వ్యక్తి శవం నీళ్లలో కొట్టుకొని వచ్చినట్లు వీఆర్ఓ, వీఆర్ఏ ఇచ్చినట్లు బిట్రగుంట పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తి సుమారు 45-(55) వయస్సు కలిగి ఉండవచ్చునని తెలిపారు. మృతుడి ఒంటి మీద లుంగీ తెలుపు నాగులారి సిగ్గయ్య - సుశీలమ్మ అనే పేర్లు కలిగి ఉన్నాయని, మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో పలు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయం మూత

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయం చంద్రగ్రహణం కారణంగా ఆదివారం రాత్రి 9 గంటల 40 నిమిషాలకు చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట మూసివేసి తిరిగి సోమవారం ఉదయం 7.30 నిమిషాలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి యథావిధిగా ఆలయదర్శనాలకు భక్తులకు అనుమతించబడుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

వ్యవసాయాన్ని కాపాడుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-జలదంకి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని అప్పగించేలా కుట్ర జరుగుతుందని దానిని కాపాడుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల రెండో మహాసభ ఆదివారం సురే చెంచురెడ్డి భవన్‌లో రావి మాల్యాద్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో మూలి వెంగయ్య మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులు కబళించే రకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని వాటికి వ్యతిరేకంగా రైతాంగం ఆందోళన చేస్తేనే రైతుల వద్దనున్న వ్యవసాయం కాపాడబడుతుందన్నారు. అదేరకంగా ఈరోజు రెండో కారు పంట వేస్తున్న జలదంకి తదితర గ్రామాల్లో మండలంలో జిల్లాలో చాలా గ్రామాల్లో దాన్యం పుట్టి రూ.15వేలకు రూ.16వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, రైతులని దివాలా తీస్తున్నారని తక్షణం ప్రభుత్వం నిర్ణయించిన పుట్టి ధర రూ.20306 కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. రావి మాల్యాద్రి అధ్యక్షులు గానూ గడ్డం మాల్యాద్రి కార్యదర్శు మరో 6 మందితోటి కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో జిల్లా రైతుసంఘం సహాయ కార్యదర్శి గోపసాని రమేష్ మాట్లాడుతూ రైతులందరూ సమైక్యంగా ఉంది పోరాడితేనే ఈ రోజు గ్రామసీమలు నిలబడతాయని ఇప్పుడు దాక జరిగిన అభివృద్ధి కూడా భవిష్యత్తులో జరిగే పరిస్థితి ఉండదని అందువల్ల రైతులు సంఘటితమై పోరాటాలకి రావాలని పిలుపునిచ్చారు.

పోరాడితేనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతసాగరం

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. మండల 3వ మహాసభ అనంతసాగరం అతిథి గృహం వద్ద జరిగింది. ఈ మహాసభలో పాల్గొన్న సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండమూరు హాజరత్తయ్య మాట్లాడుతూ సిఐటియు అనేక పోరాటాలు చేసి కార్మికుల హక్కులు సాధించిందని, కార్మికుల ఐక్యత కోసం పనిచేసే సంఘం సిఐటియు అని అన్నారు. కేంద్రంలో ఉండే బిజెపి ప్రభుత్వం కార్మికుల చట్టాలను మార్చి కేలనం నాలుగు లేబర్ కోడ్‌లు చేసిందన్నారు. ఎన్నికల హామీలో కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు, ఆశా వర్కర్లకు, వెలుగు విఒఎలకు, విఆర్ఎలకు, భవన నిర్మాణ, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగాని వేగంగా ప్రయివేటుపరం చేస్తుందన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను కాపాడుకోవడానికి సిఐటియు పోరాటం చేస్తుందన్నారు. 15మందితో సిఐటియు మండల కమిటీ ఎన్నికైంది. మండల సిఐటియు అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్‌కె మీరా మొహిద్దీన్, ఉప్పలపాడు మస్తాన్ కోశాధికారిగా నాగమణిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అన్వర్ బాషా, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సునీత, సుబ్బమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు జ్యోతి, సుశీలమ్మ, వెలుగు విఒఎల సంఘం నాయకులు లక్ష్మీ, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు సర్దార్, ఖాజావలి, గ్రామసేవకుల విఆర్ఎల సంఘం నాయకులు రవి, నరసింహులు, అంగన్‌వాడీ, ఆశ, వెలుగు విఒఎ, భవన నిర్మాణ రంగ, గ్రామ సేవకులు, విఆర్ఎలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-దగదర్తి

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలంటూ ఎపి రైతుసంఘం సహాయ కార్యదర్శి గోపసాని రమేష్ అన్నారు. వారి అధ్యక్షతన మండలంలోని నారాయణపురంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగదర్తి మండలంలో ఇప్పటికే వారం రోజుల నుండి వరికోతలు ప్రారంభమై ధాన్యం ఆరబెట్టేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక గిట్టుబాటు ధర లేక ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక అల్లో రామచంద్ర అంటూ అల్లాడుతున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు తాము సిద్ధమంటూ అన్ని రంగం సిద్ధం చేశామంటూ ప్రకటిస్తున్న ప్రకటనలు కాగితాలకు పరిమితమవుతున్నాయే తప్ప క్షేత్రస్థాయిలో అమలవుతున్న సందర్భాలు లేవన్నారు. పత్రికలలో కథనాలు ప్రచురితమవుతున్నా.. అవి తమకేమీ పట్టనట్లు అధికారులు ప్రజాప్రతినిధులు వ్యవహరించడం దారుణమన్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు అధికారులు, మిల్లర్లు, కుమ్మక్కై వరికోతలు ముమ్మురంగా జరిగేటప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా ధాన్యం సేకరించేందుకు పలురకాల అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. వరికోతల ముగింపు నాటికి కొనుగోలు కేంద్రాలన్నీ పారదర్శకంగా పని చేస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం పరిపాటి అయిపోయిందని ఈ విషయమై త్వరలోనే దగదర్తి మండలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు. ప్రతియేటా దగదర్తి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో అధికారులు అవలంభిస్తున్న వైఖరిపై సన్న, చిన్న కారు రైతులు కోట్లాది రూపాయలు నష్టపోతున్న వాపోయారు. ఈ విషయం అధికారులు ప్రజాప్రతినిధులకు తెలిసిన వారికి అందుతున్న మామూళ్ల కారణంగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లాలో ఉన్న రైస్‌మిల్లు యజమానులు సిఎంఆర్ రైస్ విషయంలో తీసుకున్న ధాన్యం ఎంత ప్రభుత్వానికి ఇచ్చిన సరుకు ఎంత వారు ఉన్న బకాయిల విషయమై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో జరుగుతున్న ఈ దందాపై ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు కుమ్మక్కై రైతులను సర్వనాశనం చేసే దిశగా చేస్తున్న వ్యవహారాలపై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పుట్టి ధాన్యానికి సుమారు రూ.3500 ప్రభుత్వ మద్దతు ధరకు మిల్లర్ల కొనుగోళ్లకు వ్యత్యాసం ఉన్న రైతులు పక్షాన నిలబడేందుకు అటు ప్రజాప్రతినిధులు గానీ ఇటు ఉన్నతాధికారులు గానీ స్పందించక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పదిమందికి పట్టెడన్నం పెట్టే అన్నదాతకు మద్దతు ధర కల్పించే దిశగా చర్యలు చేపట్టి అన్నదాత మనుగడను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 9న నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌నుంచి కలెక్టరేట్‌కు జరిగే నిరసన కార్యక్రమంలో మండల రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం గొల్లపల్లి వెంకటరమణయ్య, చల్ల మాల్యాద్రి, గోపసాని మధు, గోపసాని రవి, బత్తల హరి, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ



మాట్లాడుతున్న తాళ్లూరు మాల్యాద్రి

ప్రజాశక్తి-కావలి

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కావలి మండల ఆరో మహాసభ ఆదివారం స్థానిక శివరామసుబ్బయ్య భవనంలో వేముల సీతారామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ కావలి మండలంలో 12 వారాలు, 14 వారాలు పైన ఉపాధి హామీ డబ్బులు ఇవ్వలేదన్నారు. పనులకు ఉపాధి కార్మికులు రావటానికి ఇష్టపడటం లేదని, కనుక తక్షణం వేతనాలు చెల్లించాలని మహాసభలో డిమాండ్ చేశారు. ఇప్పటికే మండలంలో వేతనాలు రూ.307 ఇవ్వాల్సి ఉండగా, రూ.150, రూ100 మాత్రమే పడుతున్నాయన్నారు. అవి కూడా సక్రమంగా చెల్లింపులు జరగడం లేదని, గతంలో ఉపాధి కూలీలకు ఇస్తున్న పేస్లిప్పులు గానీ, గడ్డపార, చెలగపార, తట్టా, పనిముట్లు ఇచ్చేవారన్నారు. ఇప్పటి వరకుఇవ్వటం లేదన్నారు. అదేరకంగా దూరంగా పోయినప్పుడు, ఆటో ఛార్జీలు మంచినీళ్లు ఇచ్చేవారన్నారు. ఇప్పుడేమీ ఇవ్వటం లేదని, తక్షణం గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ మాటలు ఎక్కువగా మాట్లాడుతూ ఆచరణకు వచ్చేసరికి ఏమి లేకుండా ఉండటం, ఇప్పుడు రూ.307 కూలి పడుతుందని, ఆఖరికి వచ్చేసరికి రూ.150, రూ.200 మాత్రమే ఇస్తున్నారన్నారు. దానిపై తక్షణం చర్య తీసుకుని, ఉపాధి కూలీలకు కనీస కూలి వచ్చే రకంగా చేయాలని ఆయన మహాసభలో డిమాండ్ చేశారు. ఈ మహాసభలో మండల కార్యదర్శి రాధా కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధి పనిని పటిష్టంగా అమలు జరపాలని, బలవంతపు భూసేకరణే ఆపాలని, రేషన్ షాపులో 14 రకాలు వస్తువులు ఇవ్వాలని కోరారు. అధిక ధరలు తగ్గించాలని, మద్యం రాత్రి 12 గంటల వరకు సరఫరా చేస్తున్నారు, మద్యాన్ని నియంత్రించాలని, తదితర సమస్యల మీద ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని ఆయన మహాసభలో డిమాండ్ చేశారు. ఈ మహాసభ సందర్భంగా నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా పి.సీతారామయ్య కార్యదర్శులుగా ఎం.రాధాకృష్ణయ్య, మరో ఏడుగురుతోటి కమిటీని ఎన్నుకున్నారు.



9న జరిగే ప్రదర్శన జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-అల్లూరు

9వ తేదీన మంగళవారం నెల్లూరులో జరుగు ప్రదర్శన రాయబారం కార్యక్రమానికి అల్లూరు రైతులు పెద్దఎత్తున నెల్లూరు గాంధీ బొమ్మ వద్ద నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ప్రదర్శన రాయబారం కార్యక్రమానికి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అల్లూరు, దగదర్తి మండలాల సిపిఎం కార్యదర్శి గోపసాని రమేష్ కోరారు. మండల పరిధిలోని బసవారెడ్డి శంకరయ్య స్మారక భవనంలో ఆదివారం సిపిఎం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కొలుగోల కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఇసుకపల్లి కార్యదర్శి పార్టీ భాస్కర్, అల్లూరు టౌన్ కార్యదర్శి షేక్ రషీద్, నేతకాని రమణయ్య, కంచుపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

పలుచోట్ల సీతారాం ఏచూరికి నివాళులు



కోవూరులో మాట్లాడుతున్న ఎం.మోహన్‌రావు

ప్రజాశక్తి-కోవూరు

సీతారాం ఏచూరి ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్ రావు అన్నారు. ఆదివారం స్థానిక సీతా పోలయ్య భవనంలో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. తొలుత ఆయన చిత్రపటానికి ఎం.మోహన్ రావు, ప్రముఖ న్యాయవాది జక్కా శేషమ్మ పూలమాలేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే ఉద్యమాలకు నాయకత్వం వహించి సిపిఎం అఖిలభారత కార్యదర్శిగా పార్లమెంటు సభ్యుడిగా ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తేవడంలో ముందుండి కృషి చేశారన్నారు. యుపిఎ ప్రభుత్వ కాలంలో ఉపాధి హామీ చట్టం సమాచార హక్కు చట్టం లాంటి అనేక చట్టాలు రూపొందించడంలో కీలకమైన పాత్ర పోషించారన్నారు. దేశ సమైక్యత సమగ్రత కోసం పాటుపడ్డారని తెలిపారు. సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం తుదిశ్వాస విడిచేంత వరకు పనిచేశారని ఆయన ఆశయాలను ఆదర్శాలను ముందుకు తీసుకుపోయేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుజ్జయ్య, శేషయ్య, ఎస్కే బాబు, చాంద్‌బాషా, సురేష్, సర్దార్, అప్రోజే మణి, ఇంత శ్రీకాంత్‌రెడ్డి, రాజారెడ్డి, విజయ్‌కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఆదివారం బోగోలు మండలం సిపిఎం కార్యాలయంలో ప్రాంతీయ కమిటీ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు, సిఐటియు సభ్యులు, భవన నిర్మాణ కార్మికులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రాంతీయ కమిటీ నాయకులు తుమ్మల వెంకయ్య మాట్లాడుతూ కేంద్ర జాతీయ సభ్యుడిగా రెండుసార్లు సిపిఎంకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు సెక్రటరీ చాన్‌బాషా, భవన నిర్మాణ కార్మిక అధ్యక్షుడు తుమ్మల సీనయ్య, సెక్రటరీ బాదుల్లా, కమిటీ సభ్యులు బ్రహ్మయ్య, సిపిఎం విశ్వనాధరావుపేట శాఖ కార్యదర్శి ఎన్, రామయ్య, కడనూతల శాఖ కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు, సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్కే అన్వర్ భాషా, మాల్యాద్రి, దయాకర్, ఆనంద్, రాజేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంటలో..

ప్రజాశక్తి-విడవలూరు ; విడవలూరు సిపిఎం కార్యాయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుల్లూరు గోపాల్ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న రెహనాబేగం

ప్రజాశక్తి-కొడవలూరు

రైతు పడ్డ కష్టం కళ్లకు కనిపించదని ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫ్లమవుతున్నాయని పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని శ్రామిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రెహనా బేగం పేర్కొన్నారు. ఆదివారం కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాలెం ఎఎంసి గోదాములు నిర్వహించిన సిఐటియు 7వ మండలం మహాసభలకు ఆమె హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవనం సాగించిన కూలీలు పొలం కోసం భూ పోరాటాలు చేసి భూమిని దక్కించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అసంఘటిత కార్మికులంతా ఐక్యమై పోరాటాలు చేస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావన్నారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకుడు గోనె దయాకర్ మాట్లాడుతూ కార్మికులకు సిఐటియు అండగా నిలుస్తుందన్నారు. గతంలో ఎన్నో సమస్యలను సిఐటియు ద్వారా పరిష్కారం చేయడం జరిగిందన్నారు. ప్రతిఒక్క కార్మికుడు సిఐటియు బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నూతనముగా సిఐటియు కన్వీనర్లను ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్‌గా తలారి నరసింహులు కోకన్వీనర్లుగా నన్నం సురేష్ ఆకురాతి వెంకయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల జిల్లా సహాయ కార్యదర్శి సుజాత, సిపిఎం మండల కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా, అంగన్‌వాడీ వర్కర్ల మండల అధ్యక్షులు కాగుళ్ల విజయమ్మ, సిపిఎం నాయకులు విడవలూరు దేవదానం, ప్రసన్న, రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ

కార్మికులకు అండగా సిఐటియు

ప్రజాశక్తి-విడవలూరు

మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆఫీసులో సిఐటియు మండల మహాసభ జరిగింది. దానికి ముఖ్య అతిథులుగా జిల్లా కేంద్రం నుండి కె.సురేష్ అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి సుజాతమ్మ పాల్గొని ప్రసంగించారు. కార్మికులకు అండగా ఎల్లవేళలా సిఐటియు ఉంటుందని కార్మికుల ఉన్నతే సిఐటియు లక్ష్యం అనే తెలియజేశారు. అనంతరం 13మంది తోటి సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బండ రమేష్ కోకన్వీనర్‌గా పి.బుజ్జయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు.



జెవివి జిల్లా కమిటీలో ఆత్మకూరు వాసులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలు నెల్లూరు పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్ ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీలో ఆత్మకూరు పట్టణానికి చెందిన కె.సి.కృష్ణయ్య, జెవివి జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా కోఆప్షన్ మెంబర్‌గా ఒంటేరు మల్లికార్జున్ గౌరవాధ్యక్షులుగా వేము పెంచలయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీలో ఆత్మకూరు పట్టణానికి చెందినవారికి ఈ పదవుల దక్కడం సంతోషంగా ఉందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.



సొసైటీ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని భీమవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎర్రమళ్ళ చిన్నా రెడ్డిని సీతారామపురం ఎంపిడిఒ మావిడాల సాయిప్రసాద్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒంగోలు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగంలో 'వివేకానంద' రికార్డ్



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

గత 35 సంవత్సరాలుగా విద్యారంగంలో తనదైన శైలిలో దూసుకుపోతూ రికార్డు స్థాయిలో వివేకానంద స్కూల్ ముందుకు సాగుతుందని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం తేజు డెవలపర్స్ లేఔట్ లో వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ భూమి పూజా కార్యక్రమంలో ఆదివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని ప్రయివేట్ స్కూళ్ల విద్యారంగంలో వివేకానంద స్కూల్ మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ స్కూల్లో విద్యను బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి చదువుతోపాటు విలువలతో కూడిన క్రమశిక్షణ నేర్పుతుంటారన్నారు. ఉపాధ్యాయులు బోధించే విద్యను అభ్యసిస్తూ విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి చేరుకుని తమ తల్లిదండ్రులకు, స్కూలుకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు ఆమె సూచించారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో మొట్టమొదటిసారి సీబీఎస్సీ సిలబస్ విద్యా బోధన అందించే వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కాటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, యర్రం రెడ్డి గోవర్ధన్ రెడ్డి, తేజు డెవలపర్స్ అధినేత శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ప్రత్యేకత లేని స్పెషల్ గ్రీవెన్స్ డే..

ప్రజాశక్తి-కావలి

గిరిజనుల కోసం కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్ డే ఏమాత్రం ప్రత్యేకత లేకుండా పేలవంగా జరిగింది. దాదాపు 79 సమస్యలతో 100 మందికి పైగా గిరిజనులు తమ సమస్యలు పరిష్కారం అయిపోతాయానే ఆశతో గ్రీవెన్స్ డేకు హాజరయ్యారు. కానీ సోమవారం గ్రీవెన్స్ డేలో అర్జీలు తీసుకునే ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీకృష్ణను చూసి, గిరిజనులు చప్పబడిపోయారు. ఎన్నో గ్రీవెన్స్‌లలో అర్జీలు ఇచ్చినా పరిష్కారం కానీ సమస్యలు ఈ స్పెషల్ గ్రీవెన్స్‌లో ఎలా పరిష్కారం అవుతాయని గిరిజనులు వాపోయారు. కనీసం స్పెషల్ గ్రీవెన్స్ డేలో జిల్లా నుండి ఒక స్పెషల్ ఆఫీసర్ వచ్చి ఉంటే కొన్ని, కొంతమంది సమస్య లైనా తీరి ఉండేవని, పాత ఆఫీసరే స్పెషల్‌లో కనపడే సరికి గిరిజనులు, ముఖ్యంగా యానాదుల ముఖంలో చీకట్లు ముసిరాయి. ఈ స్పెషల్ డేలో వచ్చిన 79 అర్జీలలో ఎక్కువగా యానాదులకు చెందిన భూములలో, సి.జె.ఎఫ్.ఎస్. లబ్ధిదారుల పేర్లు గతంలో మ్యాన్యువల్‌గా ఉండేవి కానీ రెవెన్యూ ఆన్‌లైన్ చేయడంలో యానాదులపై నిర్లక్ష్యం చేశారు. ఆన్‌లైన్ రికార్డుల్లో వారి పేర్లు చేర్చమని కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా, సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి, గిరిజనుల సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

విద్యార్థులపై జులుం గర్హణీయం

ప్రజాశక్తి-కావలి

నాటి యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యా మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చక పోవడంతో దశల వారీగా విద్యార్థులు ఉద్యమం చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో భారత విద్యార్థి సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం విజయవాడలో నిర్వహించిన ' చలో విజయవాడ ' ర్యాలీ చేస్తే, పోలీసులు లాఠీచార్జ్ చేయడం గర్హణీయమని కావలి ఉమెన్స్ ఫోర్స్ ఖండించింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులు బిసెంట్ రోడ్డుకు చేరుకున్నారు. అక్కడి నుండి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుండి యువగళంలో హామీల ను గుప్పించి మరచిన విద్యా మంత్రి లోకేష్ ఇంటికి ర్యాలీ వెళుతుండగా.. ధర్నా చౌక్ వద్ద పోలీసులు విద్యార్థులపై జులుం ప్రదర్శిస్తూ.. విద్యార్థులపై విరుచుకు పడ్డారు. విద్యార్థినులను బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్‌లోకి తోసేశారు. ఈ ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎంఎల్‌సి లక్ష్మణరావు దానిపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 15నెలలు కావస్తున్నా.. ఇచ్చిన హామీలను నిల్పుకోలేని కూటమి ప్రభుత్వం," శాంతియుతంగా గాంధేయ మార్గంలో " తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఆందోళన చేస్తున్న యువతను ఇలా అప్రజాస్వామికంగా అణచివేయడం దారుణమని మండిపడ్డారు. ప్రజాతంత్ర వాదులంతా ప్రభుత్వ వైఖరిని ఖండించాలన్నారు. విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని నిలదీయాలని సి.శారద, ఇ.లావణ్య, షేక్.ఫాతిమా, పార్వతీ శంకర్, సుజాత, షేక్. బుష్రా, తదితర ఉమెన్ ఫోర్స్ కమిటీ సభ్యులు కోరారు.

In The Court of The Civil Judge (Senior Division) Kavali.
OS NO.135/2011

Between :
Dr. M.B.Nageswararao,
S/O **M. Ramaswamy,**
Principal Scientist (H) & Head,
Agricultural Research Station,
Kavali. SPSR Nellore District. - Plaintiff
Vs
1) Devineni Venkata Ramanaiah
and 6 others -Defendents

To,
D5) Smt Bandi Amaravathamma,
W/O Late **Ramanaidu,**
D7), Smt. Bandi Padma,
D/o Late **Ramanaidu,**
D5), D7) are R /O 10-30-63, Bapuji Nagar,
Kavali. SPSR Nellore (Dt).

5వ,7వప్రతివాదులకు దావా నోటీసు

ఈ నంబరున వాది ప్రతివాదులగు మీపై ఈ నంబరు దావా దాఖలు చేయగా, శ్రీ కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం తే.12-09-2025 ది. కి వాయిదా వేసి యున్నారు. కావున మీరు ఆ దినం పగలు 10.30.గం. లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై, మీకు గల అక్షేపణలు తెలుపు కొనవల్సి ఉన్నది. హాజరు కాని యెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించ బడును.

ఇట్లు
కలికి శ్రీనివాసులు రెడ్డి,
వాది తరుపు న్యాయవాది, కావలి,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.